నెల నెలా ఆకాశవాణి

# తెలుగు సాహిత్య స్వరూపం

నన్నయ్యతో తెలుగు సాహిత్యం ప్రారంభమైందని చెప్పుకుంటాం. ఆయన ఆదికవి అని, శ్రీమదాంధ్ర మహాభారతాన్ని ఆది కావ్యమని సాహిత్య చరిత్రలో వుంది. ఆ వాదనను కాదన్నవారూ ఉన్నారు. అంతకు పూర్వమే రచనలు వచ్చాయని అన్నారు. చాలా చర్చోప చర్చలు సాగాయి. అయితే తెలుగు ఒక వ్యవస్థీకృతమైన భాషగా నన్నయ్యకు పూర్వమే వున్నదని అందరూ అంగీకరించారు. జన వ్యవహారంలో సుసంపన్నంగా ఉందని, ఆంధ్ర మహాభారత రచనకు రంగం సిద్ధంగా ఉన్నదని ఒప్పుకోవాలి. లేకపోతే ఒక్కసారిగా అంత గొప్ప కావ్యం రాదు కదా! నన్నయ్య ఆది, సభాపర్వాలు పూర్తిగా అరణ్యపర్వంలో కొంతభాగం రచించారని మనకు తెలుసు. ఆయన కవిత్వశైలి శిల్పం కూడా విశిష్టమైంది. తిక్కనది ప్రత్యేకమైన శైలి. నాటకీయశైలి. నన్నయ భారతంలో సంస్కృతం ఎక్కువపాళ్ళయితే తిక్కన కావ్యనచనలో తెలుగు పలుకులు అధికం. నన్నయ 11 వ శతాబ్దం వారైతే తిక్కన్న 14 శతాబ్దం వారు. నన్నయ తర్వాత తిక్కన నాటికి తెలుగు సొంత గొంతును సంతరించుకున్నది. అట్లా తిక్కన రచనలో తెలుగును పుష్కలంగా ప్రవేశపెట్టిన కారణంగా తెలుగు భారతం తెలుగువారి సాహిత్య వ్యక్తిత్వ ప్రతిష్టకు ఎనలేని స్థానం కట్టబెట్టి వుంటుంది. ఈ విధంగా నన్నయ ప్రారంభించిన కావ్య రచనవల్ల తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ళ ప్రాచీన ప్రతిపత్తి లభించింది అనేది నిర్వివాదాంశం. అనేక భాషలు, ఆ భాషల్లోని సాహిత్యం మేం ఇంత పాచీనం అంతప్రాచీనం అని లెక్కలు వేసుకుంటూ మేము ముందంటే మేము ముందనుకుంటూన్న రోజుల్లో ఈ చర్చ వాంఛనీయమే.

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం తరతరాల సాంస్కృతిక వారసత్వ సంపద. సాహిత్యం సాంస్కృతిక వారసత్వమెలా అవుతుంది? చతుష్షష్టికళల్లో లలితకళలు ఐదు. ఆ ఐదు – సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రకళ. సాహిత్యం కూడా కళే. స్థూల దృష్టితో చూస్తే సంస్కృతి అంటే ఒక దేశ ప్రజల జీవనావరణంలోని సర్వస్వం. అందులోని విశిష్టమైన అంశాలన్నీ సంస్కృతిలో ఒక భాగమే. అటువంటి విశిష్టాంశాల్లో లలిత కళలకు, అందులోనూ సాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. అందుకే విస్తృతార్థంలో మన సాహిత్యం తరతరాల సాంస్కృతిక వారసత్వ సంపద అని వ్యవహరించడం జరిగింది.

వెయ్యేళ్ళ సాహిత్యం ఒక మహాసృజన ప్రవాహం. తెలుగువారి చరిత్రలో రాజరాజనరేంద్రుని కాలంలో ప్రారంభమైంది. నాటినుండి కాలాన్ని కవుల జనజీవన, కావ్య రచనల పరంగా, వారి రచనలకు పోషణ ప్రోత్సాహాలనిచ్చిన రాజుల కాలాల పరంగా ఒక క్రమాన్ని రూపొందించుకున్నాం. అలా చూసినప్పుడు ఎన్నో రకాల ప్రభావం సాహిత్యంపై కనిపిస్తుంది. విశ్లేషించాలే గాని ఎన్నో ప్రభావాలు. ముఖ్యంగా మతం ప్రభావం ఉంటుంది. ఆ కావ్యాలను విశ్లేషించేటప్పుడు అప్పటి భాషాభివృద్ధి స్థితి కూడా తెలుసుకోవచ్చు. అప్పటికి అంటే అది రచింపబడినప్పటికి అది ఆధునిక భాషే. వివిధ కాలాల్లో ప్రజల అవసరాలను, వారి ఆకాంక్షలను బట్టి రచనా భాషలో, మాట్లాడే భాషలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆ రకంగా మన కవులంతా తమ శక్తిని బట్టి. అప్పటి యుగధర్మాన్ని బట్టి ఎప్పటికప్పుడు చాలా మార్పులు ప్రవేశపెట్టారు. ఈ మార్పులు భాషలో, భావంలో, రచనా వైవిధ్యంలో అన్నింటా కనిపిస్తాయి.

తెలుగులో సాహిత్య రచనను రాజవంశాలను బట్టి, కావ్య ప్రక్రియలను బట్టి నూతన మార్గాలను నిర్మించిన కవులను బట్టి సాహిత్య యుగ విభజన జరిగింది. కవిత్వమంతా సాహిత్యమే గాని సాహిత్యమంటే కవిత్వం ఒక్కటే కాదు. కొత్త కొత్త ప్రక్రియలు వచ్చి చేరాయి. కాలానుగుణంగానూ, ఇతర భాషల ప్రభావంతోనూ తెలుగులో నూతన ప్రక్రియల్ని ప్రవేశపెట్టినవారున్నారు. 1050 ప్రాంతంలో కవిత్వం, అందులో పద్యరూప కవిత్వం ప్రారంభమైతే దాదాపు 1900 వరకు పద్యరూప కవిత్వమే నడిచింది. 19 వ శతాబ్దం చివరి దశకంలో నవల అనే ప్రక్రియ ఉనికి కనిపిస్తుంది. 1900 తర్వాతనే కవిత్వం పద్యంతో పాటు వచన కవిత, గేయకవిత గా విస్తరిస్తే పాశ్చాత్య ప్రభావంతో నవల విస్తృతమైంది. తెలుగులో కథ చెప్పడం మొదట్నుంచీ వుంది. అయితే పాశ్చాత్య ప్రభావంతో, ఆధునిక కథానిక (Short Story) లక్షణాలతో కథ ప్రారంభమైంది. కావ్యయుగం, ప్రబంధయుగం, దక్షిణాంధ్రయుగం ప్రధానంగా కవిత్వంలో వున్నాయి. 1900 తర్వాత తెలుగు కవిత్వం ఆధునిక యుగం కూడా వచ్చింది. అంటే అంతకు పూర్వం వచ్చిన కవిత్వాన్ని ప్రాచీన కవిత్వమని, అనంతర కవిత్వాన్ని ఆధునిక కవిత్వమని చెప్పుకోవడం ప్రారంభమైంది. ప్రాచీన కవిత్వానికి వాహిక పద్యమే. ఆధునికకాలం తెలుగు కవిత్వ వృక్షానికి ఎన్నో కొమ్మలు మొలిపించింది. ఆ కొమ్మలకు నవ్యకవులు తమ రచనా వైవిధ్య వైభవంతో రకరకాలైన పూవులను పూయించి కొంగ్రొత్త పరిమళాలను సంతరించారు. ఆ రకంగా నవ్యకవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం, దళిత కవిత్వం, స్త్రీవాద కవిత్వం అని అనేక ధోరణులను సంతరించుకున్నది. పద్యం ఎప్పటికీ సజీవమైన, శిల్పబంధురమైన, అనితర సాధ్యమైన ప్రక్రియగా వుంది. ఆధునికులు కొందరు దాన్ని తోసిరాజన్నా కథ, నవల, నాటకం, వ్యాసం, అనువాదం. ఇలా వచన ప్రక్రియలు శాఖోపశాఖలుగా విస్తరించాయి. సాహితీసృజన పద్యాన్ని దాటిన తర్వాత వచన ప్రక్రియలు ప్రవేశించిన తర్వాత కవి రచయితల సంఖ్య పెరిగింది. లౌకికాలౌకిక దృక్పథం వికసించింది. వైవిధ్యం పెరిగింది. పాఠకుల సంఖ్య పెరిగింది. విమర్శనారీతి ఎదిగింది. వివిధ భాషల సాహిత్యంలో ఆదాన ప్రదానం ఏర్పడింది. తులనాత్మకమైన అధ్యయనం ప్రవేశించింది. సాహిత్యానికి ప్రాచుర్యం విస్తరించింది. కావ్య ప్రబంధయుగాల్లో తొలుత పౌరాణిక కథలు, ఆ తర్వాత శృంగార ప్రధానమైన గాథలు వస్తువులయ్యాయి. ఆధునిక సాహిత్యం వచ్చేసరికి సామాన్య మానవుడు, సమకాలీన సామాజిక సమస్యలే కవిత్వానికి, కథకు, నవలకు, నాటకానికి ఇతివృత్తాలయ్యాయి. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం కాలానికి ఎవరి గురించి వారే శక్తివంతంగా రాసుకోవాలన్న అభిప్రాయం ప్రబలింది. అది వాస్తవికంగా కూడా అభివ్యక్తమయింది, ఇప్పుడు సాహిత్యం వేల కలాల నుంచి వేనవేల శైలుల్లో, అపారమైన వైవిధ్యంతో అక్షరరూపం దాలుస్తున్నది. ఎటొచ్చీ కవిత్వం రాయాలన్నా, కథ రాయాలన్నా, నాటకం రాయాలన్నా ఆ ప్రక్రియలో రచన ఎలా చెయ్యాలన్న అవగాహనతో పాటు భాషపైన పట్టుండాలి. సాహితీ సృజన అంటే సామాన్యమైందా ? తన ఊహకు ఊపిరినూదుతూ ఒక కొత్త లోకాన్నే సృష్టించడంలాంటిది. అందుకే లాక్షణికులన్నారు “కవిర్మనీషి పరిభూఃస్వయంభూ” అని. “నా నృషీ కురుతే కావ్యం” అని. కవి స్వయంగా సృష్టికర్త అని ఒకరంటే. ఋషి కాని వాడు కావ్యం రాయలేడని మరొకరన్నారు.

**డా.జె.చెన్నయ్య**